26-04-2025
శనివారం
మల్కాజిగిరి


jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 213 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

## రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఫోన్

■ **గడువు తరువాత ఏ పాకిస్తానీని దేశంలో ఉండనివ్వకండి**



**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 :** కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, దేశం వీడేందుకు నిర్దేశించిన గడువు తరువాత ఏ పాకిస్తానీనీ భారత్‌లో ఉండనివ్వరాదని ఆదేశించినట్లు అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. పాకిస్తానీలకు జారీ చేసిన అన్ని వీసాలను ఈ నెల 27 నుంచి రద్దు చేస్తున్నట్లు భారత్ గురువారం ప్రకటించింది. మంగళవారం పహల్‌గామ్‌లో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులను బలిగొన్న ఉగ్ర దాడిపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తిరిగి రావలసిందిగా

...మిగతాది 2 లో

## ఉగ్రవాదంపై పోరు సాగించాలి


■ **రాహుల్ గాంధీ**



**జయభేరి, శ్రీనగర్, ఏప్రిల్ 25:** పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో

...మిగతాది 2 లో

## ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ కన్నుమూత



**జయభేరి, బెంగళూరు ఏప్రిల్ 25:** ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు. 1990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్ఎసి డైరెక్టర్‌గా పని చేశారు. 1994 నుంచి 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు భారతీయ అంతరీక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్‌గా సేవలు అందించారు. జెఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరి రంగన్ పనిచేశారు. 20032009 వరకూ ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. దీంతో పాటు మోదీ సర్కార్ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా రంగన్ పని చేశారు. ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ మీద దేశద్రోహం ఆరోపణలు వచ్చినప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా ఉంది కస్తూరి రంగనే. 1969లో ఆయన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం.

## తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం

■ **కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసింది.. మాజీ మంత్రి హరీష్ రావు**






- ఉగ్రవాదులకు గట్టిగా బుద్ధి చెప్పాలి
- భారత ప్రజలంతా ఒక్కటిగా నిలబడాలి
- ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా

జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సంఘీభావ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఉగ్రదాడిలో చనిపోయినవారికి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులు అర్పించారు.

# ప్రధానమంత్రి మోదీకి మద్దతు ఇస్తాం

**జయభేరి, హైదరాబాద్ :** హైదరాబాద్ పీవీ మార్గ్ (నెక్లెస్ రోడ్డు)లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు సాగిన కొవ్వొత్తుల ర్యాలీలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రివర్గ సహచరులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, భారత్ సమ్మిట్ 25 లో పాల్గొనడానికి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘీభావ ర్యాలీని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పహల్‌గామ్‌లో అమాయకుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైనవారిపై కఠినంగా చర్యలు తీసుకునే విషయంలో యావత్ దేశం కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. "ఈ భావోద్వేగ సమయంలో 140 కోట్ల మంది భారత ప్రజలంతా ఒక్కటిగా నిలబడాలి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఇది రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం చాటుకోవాల్సిన సందర్భం. దాడికి బాధ్యులైన వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో భారత ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాము. 1967లో చైనాపై, 1971లో పాకిస్తాన్‌పై నాటి ప్రధాని ఇందిరా గాంధీ నాయకత్వంలో మన దేశం చూపిన తెగువను గుర్తు చేస్తున్నాను. ఇందిరా గాంధీ స్ఫూర్తితో ఉగ్రవాదులకు గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో కలపే విశయంలోనూ ప్రధానమంత్రికి మద్దతు ఇస్తాం. అలాగే, ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా ఇస్తున్నాం" అని అన్నారు.

## ఉగ్రదాడిపై ప్రతీకారం

### భారత్ ముందు నాలుగు మిలిటరీ ఆప్షన్‌లు



**జయభేరి, న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 25 :** మూడు రోజుల క్రితం పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో భారత్ ఉలిక్కిపడింది. ఈ దాడిలో 28 మంది అమాయాక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపేసింది.ఇక పహల్గాంలో నరమేథం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది.

...మిగతాది 2 లో



## బాబు మాస్టర్ ప్లాన్

**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 25:** మంద కృష్ణ మాదిగ. పరిచయం అక్కర్లేని పేరు ఇది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో ఆయన సుపరిచితం. జాతీయ స్థాయిలో సైతం తనదైన ముద్ర చాటుకున్నారు. ఎక్కడో ప్రకాశం జిల్లాలో 14 మంది యువకులతో మాదిగ దండోరాను ఆయన ప్రారంభించారు. ప్రతి మాదిగ గూడెంలో దండోరా జండా ఎగిరే విధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని విస్తరించారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను కొన్ని వర్గాలకే దక్కాయని.. అందరికీ విస్తరింపజేయాలన్న ధ్యేయంతో ఆయన చేపట్టిన ఉద్యమం జాతీయ స్థాయిలో సైతం కలిగితురాయిగా నిలిచింది. అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం ఎస్సీ వర్గీకరణకు జై కొట్టింది. దీంతో జాతీయస్థాయిలో సైతం

...మిగతాది 2 లో

## కేటీఆర్ కు ఫుల్ పవర్స్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 25:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఉగ్రదాడిపై ప్రతీకారం

ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాలుగు ఆప్షన్‌లు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి.
సిమ్లా ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదిరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్‌వోసీ వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే పలు బలమైన పొజిషన్లలో పాకిస్థాన్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు. భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులువు కాకపోవచ్చు. సక్సెస్‌ఫుల్‌గా సర్జికల్ స్ట్రైక్స్ చేయాలంటే రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.
ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడా వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.

## బాబు మాస్టర్ ప్లాన్

మందకృష్ణ మాదిగ పేరు మార్మోగింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగను రాజకీయంగా ప్రోత్సహించాలని ఎన్డీఏ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ ద్వారా తనకు లభించిన రాజ్యసభ పదవిని సైతం ఆయన వదులుకున్నారు. దీంతో ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఖాళీ అయింది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ తరుణంలో రకరకాల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ సీటు బిజెపికి విడిచిపెట్టాలని ఆ పార్టీ పెద్దలు కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఢిల్లీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీని సైతం ఏపీ నుంచి రాజ్యసభకు పంపిస్తారని టాక్ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగ పేరు తెరపైకి వచ్చింది. దీని వెనుక చంద్రబాబు వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. మెజారిటీ ఎస్సీ ఉప కులాల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు ఆదరణ పెరిగింది. ప్రధానంగా మాదిగ, రెల్లి ఉప కులాల నుంచి విశేష స్పందన వస్తోంది. వాస్తవానికి ఎస్సీ సామాజిక వర్గం ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు దారుగా ఉంది. కానీ 2024 ఎన్నికల్లో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక కనిపించింది. దానిని అలాగే ఉంచుకోవాలంటే ఎస్సీ వర్గీకరణ అనేది చేయాలని చంద్రబాబు ప్లాన్. అందుకే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మరుక్షణం.. ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిందో లేదో అమలు చేసి చూపించారు. అదే సమయంలో ఆది నుంచి ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు మంద కృష్ణ మాదిగ అనేక సందర్భాల్లో మద్దతు తెలిపారు. అదే సమయంలో మొన్నటి ఎన్నికల్లో తెలంగాణలో సైతం బిజెపికి మద్దతు ప్రకటించారు. రెండు చోట్ల ఎన్డీఏ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేశారు. అందుకే ఇప్పుడు మందకృష్ణ మాదిగ పేరును తెరపైకి తెచ్చి.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీఏ లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలోఅధికారంలోకి రావాలన్నది బిజెపి ప్లాన్. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగానే బీసీ నేత కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగ కు ఇస్తే.. బీసీలతో పాటు మాదిగ సామాజిక వర్గం బిజెపి వైపు వస్తుందన్నది ప్లాన్. ఇదే విషయాన్ని బిజెపి అగ్ర నేతలకు చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది. మంద కృష్ణ మాదిగకు రాజ్యసభ పదవి ఇస్తే తెలంగాణతో పాటు ఏపీలో రాజకీయంగా లబ్ధి పొందవచ్చని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మొత్తానికైతే అనూహ్యంగా పెద్దల సభలో మందకృష్ణ మాదిగ అడుగుపెట్టడం ఖాయమని తెలుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## కేటీఆర్ కు ఫుల్ పవర్స్



రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

## ఉగ్రవాదంపై పోరు సాగించాలి

ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటున్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# పీఓకే విలీనమే పరిష్కారమా...

**పహల్గామ్ లో ఉగ్రదాడితో అందాల కశ్మీరం... అల్లకల్లోలంగా మారింది. ఉగ్రతూటాకు ఆ ప్రాంతం అల్లాడిపోయింది. ముష్కరుల రాక్షసకాండకు 26 మంది అమాయకులు బలయ్యారు. దీంతో భారత్, పాక్ మధ్య వివాదం మరింత ముదిరింది. భారత్ సరిహద్దుల్లో ఆయుధాలు సిద్ధం చేసుకుంటూనే... పాక్‌కు వెన్నులో వణుకుపుట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఖరాకండిగా పాక్‌తో దౌత్య సంబంధాలు తెంచేసుకుంది.**




పహల్గామ్ ఉగ్రదాడిని అమెరికా, రష్యా, చైనా, శ్రీలంక, ఇటలీ, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలుదేశాలు ఖండించాయి. ఉగ్రవాదుల ఏరివేతకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై పోరాటంలో మద్దతుగా ఉంటామని ప్రకటించాయి. దీంతో ప్రపంచదేశాల సపోర్టుతో పాక్‌ను భారత్ ఒంటరిని చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తోంది.ఇటు జీ20 దేశాల రాయబారులతోనూ భారత విదేశాంగ శాఖ భేటీ అయ్యింది. దౌత్యవేత్తలకు పహల్గామ్ ఉగ్రదాడి గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు భారత విదేశాంగ అధికారులు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న తీరును... భారత్‌పై పాక్ పదేపదే కవ్వింపులకు దిగుతున్న పరిణామాలను దౌత్యవేత్తలకు తెలియజేశారు. పాక్ కుట్రలను ఇటు అఖిలపక్ష సమావేశంలోనూ వివరించింది కేంద్రం. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాక్ తీరుపై అన్నిపార్టీలు కన్నెర్ర చేశాయి.
పాక్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా స్వాగతిస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సైతం మద్దతిచ్చారు.పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనం' భారత్‌లో రాజకీయంగా, భద్రతపరంగా అత్యంత చర్చనీయమైన అంశం. ఈ విషయంపై భారత్‌లో ప్రభుత్వ విధానాలూ, ప్రజల భావోద్వేగాలూ గట్టి స్థాయిలో ఉన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడితో మరోసారి పీఓకే విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యకు 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అయితే, ఈ దాడిని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం చేసిందా? పాకిస్థాన్‌తో

**పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్‌లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్‌ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. "ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్‌లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది.. ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది"**

పూర్తిస్థాయి యుద్ధం జరిగి త్వరలోనే పీఓకే విలీనం అవుతుందా? దాయాది పాకిస్థాన్ కుట్రలకు అడ్డుకట్ట పడుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ దిశగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతుందని చెబుతున్నారు.ఇదే సమయంలో తాజాగా, ప్రముఖ జ్యోతిషుడు ఏడాది కిందట చెప్పిన జోస్యం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పహల్గామ్ దాడి పీఓకేలోని చాలా భూభాగాన్ని భారత సైన్యం స్వాధీనం చేసుకోడానికి కీలక అవకాశం కల్పించిందని, ఈ విషయంలో ఆర్మీ విజయం సాధిస్తుందంటూ రుద్ర కరణ్ ప్రతాప్ అనే జ్యోతిషుడు అంచనా వేశారు.
గతంలో ఈయన చెప్పిన జోస్యాలు ఫలించడంతో దీనిపై నమ్మకం పెరిగింది. వాస్తవానికి గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ జ్యోతిషుడు.. ప్రధాని మోదీ, పీఓకే స్వాధీనం గురించి జాతకం చెప్పడం విశేషం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం కుజ మహదశలోకి ప్రవేశించారని, మూడోసారి ఆయన పదవిలోకి వచ్చి.. దేశ భూభాగానికి సంబంధించిన వివాదాలపై దృష్టిసారించి సత్ఫలితాలు సాధిస్తారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏప్రిల్ 2025 నుంచి సెప్టెంబరు 2025 మధ్య భారత్‌లో విలీనం అవుతుందని 2024 ఏప్రిల్ 6న ట్వీట్ చేశారు. దీనికి ప్రత్యేక క్రెడిట్ లేదా గుర్తింపు అవసరం లేదంటూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.తాజాగా, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం అప్పట్లో తాను పెట్టిన పోస్ట్‌ను జ్యోతిషుడు రీపోస్ట్ చేస్తూ.. "ఏప్రిల్ 22, 2025 నాటి సంఘటనలు ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తాయి.. పహల్గామ్‌లో జరిగిన ఒక దారుణమైన, పిరికిపంద ఉగ్రవాద దాడి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను రేకెత్తిస్తుంది.. ఈ సమయంలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని గణనీయమైన భాగాన్ని భారత సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది" అని ట్వీట్ చేశారు.దేశ విభజన అనంతరం 1947లో పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీర్‌లోకి కొంత భూభాగమే పీఓకే. దీనిని అధికారికంగా తమ భూభాగంగా భారత్ భావిస్తుంది. సంవిధాన పరంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్‌లో భాగమే.
పీఓకేను స్వాధీనం తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని భారత పార్లమెంటు 1994లో ఏకగ్రీవంగా తీర్మానించింది కూడా.అయితే, విలీనం అంత ఆషామాషీ కాదు. ప్రస్తుతం పాకిస్థాన్ అధీనంలో ఉన్న పీఓకేలో పాక్ సైన్యం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటీవల అక్కడ హమాస్ నేతల పర్యటన, ఉగ్రవాద శిబిరాల ఉనికిపై భారత్‌కు ఆగ్రహాన్ని కలిగించాయి. ఉగ్రదాడుల నేపథ్యంలో PoKపై కేంద్రం మరింత దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి.రాజకీయదౌత్యపరంగా: అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి తెచ్చి, దానిని భారత్‌కు తిరిగి అప్పగించే మార్గం (కానీ ఇది చాలా కష్టం).రక్షణ చర్య: సైనిక మార్గంలో తిరిగి స్వాధీనం చేసుకోవడం. అయితే, ఇది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవచ్చు.ప్రజా ఉద్యమాల ద్వారా: పీఓకే లో నివసించే ప్రజలు పాకిస్థాన్ పాలనపై అసంతృప్తిగా ఉండటం, స్వేచ్ఛను కోరడం దీన్ని భారత్ అనుకూలంగా మలచుకోవడం.ఇటీవల కేంద్రంలోని పెద్దలు కొన్ని సందర్భాల్లో పీఓకేను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సరిహద్దు ఉగ్రవాదంపై తీవ్ర స్థాయిలో స్పందిస్తున్న నేపథ్యంలో PoKపై మరింత దృష్టిసారించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమవుతాయో? జోస్యం ఫలిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

## రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఫోన్



పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారత జాతీయులకు కేంద్రం సలహా ఇచ్చింది. హోమ్ శాఖ మంత్రి స్వయంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి గడువు తరువాత భారత్‌లో ఏ పాకిస్తానీ బస చేయకుండా చూడాలని వారిని కోరినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. తమ తమ ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, వారిని తిప్పిపంపేలా చూడాలని కూడ ముఖ్యమంత్రులను కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వీసాల రద్దు ఆదేశం హిందు పాకిస్తానీ జాతీయులకు ఇదివరకే జారీ చేసిన దీర్ఘ కాలిక వీసాలకు వర్తించదు. అవి 'చెల్లుబాటులో ఉంటాయి.' పహల్‌గామ్ దాడికి సీమాంతర సంబంధాలు ఉండడంపై పాకిస్తానీ జాతీయులకు వీసా సర్వీసులను వెంటనే నిలుపుదల చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. 26/11 ముంబయి ఉగ్ర దాడి దరిమిలా దేశంలో పౌరులను లక్షంగా చేసుకున్న హీనమైన ఉగ్ర దాడి అది. అదనంగా సార్క్ వీసా పొడిగింపు పథకం (ఎస్‌విఇఎస్) కింద భారత్‌కు ప్రయాణించేందుకు పాకిస్తానీ జాతీయులను అనుమతించబోమని, ఎస్‌విఇఎస్ వీసా కింద ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాకిస్తానీ జాతీయుడు ఎవరైనా 48 గంటల్లోగా దేశం వదలి వెళ్లాలని కూడా ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఆ గడువు శుక్రవారంతో ముగిసింది. పహల్‌గామ్ మారణకాండలో పాత్ర ఉన్న ప్రతి ఉగ్రవాదిని, వారి 'మద్దతుదారులను' భారత్ 'గుర్తించి, ఆచూకీ తీసి, శిక్షిస్తుంది' అని, హంతకులను 'భూమి చివరి వరకు' వెంటాడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం విస్పష్టంగా ప్రకటించారు. మరొక వైపు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా దౌత్యపరంగా దాడిని భారత్ ముమ్మరం చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలతో సంబంధం లేకుండా నాయకులు అందరూ ఉగ్రవాదంపైన, ఉగ్ర శిబిరాలపైన కఠిన చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు హామీ ఇచ్చారు. భారత్ అదే సమయంలో 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని వెంటనే నిలిపివేస్తున్నట్లు కూడా పాకిస్తాన్‌కు తెలియజేసింది. ఒప్పందం షరతులను పాక్ ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది.

## ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం

- **కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసింది..**
- **రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది**

**జయభేరి, సిద్దిపేట :**

సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాం పల్లి అమర వీరుల స్థూపం నుండి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత పాద యాత్ర చేపట్టారు. అమర వీరుల కు నివాళ్లు అర్పించి.. జెండా ఊపి పాదయాత్ర ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కాశ్మీర్ పెహల్గంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుండి పాదయాత్రలో బయలుదేరినటువంటి విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నాను. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది 27వ తేదీన వరంగల్ లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినావాభావ సంబంధం ఉంది. ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైన సిద్దిపేటకు పేగు బంధం ఉందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పుట్టిన నాడు చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. గాలి బుడగ లాంటిది పాలపొంగు లాంటిదని అమాసకు పుట్టింది పున్నానికి పోతది అని కూడా అన్నారు. మనల్ని అన్న వాళ్లు ఆగమయ్యారు తప్ప టిఆర్ఎస్ పార్టీ ఆగం కాలేదు. చాలా పార్టీలు పుడుతుంటాయి పోతుంటాయి కానీ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా చరిత్రలో నిలిచింది. కేసీఆర్ గారి నాయకత్వంలో అంబేద్కర్, గాంధీల మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు బోధించు, సమీకరించు, పోరాడు అని అన్నారు. అదే పద్ధతిలో కెసిఆర్ గారు, ప్రొఫెసర్ జయశంకర్ గారు ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారు. 1969లో చాలామంది అమరులయ్యారు. ఎంతోమంది విద్యార్థులు మరణించారు. పోలీస్ కాల్పుల్లో 369 మంది చనిపోయారు. ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో కేసీఆర్, గాంధీ చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపారు. 14 ఏళ్ల ఉద్యమం,




10 ఏళ్ల ప్రభుత్వం ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం. ఏ పాత్ర అయినా బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షం. రాష్ట్ర సాధన కోసం, మన ఆత్మగౌరవం కోసం 14 ఏళ్లు పోరాటం చేసాం. పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపాము. ధాన్యం ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో, జిఎస్డిపిలో తెలంగాణను నెంబర్ వన్ గా నిలిపాము. అంతేకాదు డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణ నెంబర్ వన్. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన పథకాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చింది, కాంగ్రెస్ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయి. ఓడినా, గెలిచినా ప్రజల పక్షాన, ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బిఆర్ఎస్ మాత్రమే.ఈరోజు ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలి. ఆరోజు లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించడానికి రామదండు కదిలింది. అలాగే ఈరోజు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది. మూడు రోజులపాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి గులాబీ దండు రజితోత్సవ సభను విజయవంతం చేయడానికి కదిలిందని అన్నారు. ఈ పాదయాత్ర విజయవంతం చేయడానికి అందరూ క్రమశిక్షణతో ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా నడవాలి. ఎవరికి చిన్న ప్రమాదం కానీ గాయం కానీ జరిగితే నా గుండె బాధపడుతుంది కాబట్టి అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నాను. పాదయాత్రలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను వివరించండి. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి భోజన సమయంలో మిమ్మల్ని కలుసుకుంటాను. గ్రామాల వారీగా, మండలాల వారీగా, పట్నాల వారీగా టీములు క్రమశిక్షణతో ముందుకు సాగాలి. మీకు అన్ని వసతులను ఏర్పాటు చేస్తాం. కంటికి రెప్పలా చూసుకునేందుకు మన పార్టీ సీనియర్ నాయకులు మిమ్మల్ని పర్యవేక్షిస్తారని అన్నారు.

# నీటిని దోచేస్తున్నారు

- వాటర్ ప్లాంట్ల పేరుతో జల దోపిడీ
- నిత్యం లక్షల లీటర్ల నీరు అక్రమంగా తరలింపు
- కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం

**జయభేరి, మేడ్చల్ :**



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మినరల్ వాటర్ ప్లాంట్ల పేరిట దోపిడీ జరుగుతోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న నీటిశుద్ధి కేంద్రాలు (ప్యూరిపైడ్ వాటర్ ప్లాంట్)పై అధికారుల నిఘా కరువైంది. దీంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలగా సాగుతోంది. మున్సిపాలిటీ పరిదిలోని 5వ వార్డు దులపల్లి రోడ్డులో వాటర్ ప్లాంట్ల పేరుతో నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ నీటి కేంద్రాలను నుండి నిత్యం అక్రమంగా వందల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్ల లో శుద్ధి చేసిన నీటిని మాత్రమే విక్రయించాలి. కానీ నీటి ఎద్దడిని ఆసరాగా చేసుకున్న కొందరు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నేరుగా బోర్ల ద్వారా నీటిని అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారు. మైసమ్మ గూడలో వందల సంఖ్యలో వసతి గృహాలు (హాస్టళ్లు) ఉండటంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. దింతో దీనిని వ్యాపారంగా మార్చుకొని కొందరి దళారులు ట్యాంకర్ల ద్వారా నీటి దందా సాగిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు వాటర్ ప్లాంట్ల యజమాన్యాలు బ్యూర్ ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు.




**కాసులు కురిపిస్తున్న నీటి వ్యాపారం**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్ల పేరుతో జరుగుతున్న అక్రమ నీటి దందా దళారులకు కాసులు కురిపిస్తుంది. రోజుకు వందల ట్యాంకర్లతో ఇష్టానుసారంగా నీటిని తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. వాస్తవానికి ప్రజలకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ నుండి ప్రజలకు త్రాగునీరు సరఫరా జరుగుతుంది. మైసమ్మగూడలో అక్రమంగా వెలిసిన భవనాలలో వసతి ఉండే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం మరోవైపు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఒక్కో భవనానికి ఇష్టానుసారంగా బోర్లు వేయడంతో ఒక్కసారిగా నీటి ఎద్దడి ఏర్పడింది. దింతో అదనుచూసిన దళారులు అక్రమ నీటి దందాకు తెరలేపారు. భూగర్భ జలాలు అడుగంటకుండా ట్యాంకర్లతో జరుగుతున్న నీటి సరఫరా కు సంబంధిత అధికారులు చెక్ పెట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## నిబంధనలకు నీళ్లు

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్‌లలో ఎయిర్ కండిషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్ మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతీ మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్‌లు ఇవ్వడం కానీ, అంతకుముందు ఉంటే కొనసాగించడం వంటివి చేస్తారు. ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాని అధికారులు కార్యాలయాలకు సైతం ప్యూరిఫైడ్ పేరుతో నీటిని సప్లయ్ చేస్తున్న వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడమే కాకుండా అధికారులు తాగుతున్నారే తప్ప అసలు ఈ వాటర్ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేశారు. తమ శాఖ అనుమతులు ఇవ్వకుండానే ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారనే కనీస పట్టింపు లేకుండా అధికారులు తమ విధులను కొనసాగిస్తున్నారు.




## ప్రమాద భీమా ఉండాలానే ఆలోచనతో ఈ పోస్టల్ భీమా

- కైకలూరు నియోజకవర్గం లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోస్టల్ ఇన్సూరెన్స్ కార్యక్రమం

**జయభేరి, కైకలూరు, ఏప్రిల్ 25:**

కైకలూరులో ట్రావెల్స్ బంగ్లా వద్ద విలేకరులకు పోస్టల్ భీమా చేయించారు కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ.. అన్ని రంగాలవారిని ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. సమాజంలో విలేకరుల పాత్ర చాలా కష్టతరమైనదని, ప్రతి వార్త ప్రజలకు చేతవేయటంలో విలేకరులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వార్తల్లో ఫోటోలకి గాని వీడియో లకి గాని ఎంతో శ్రమించి మనకి అందిస్తారు. ఎలాంటి వాతావరణంలోనైనా కాలాలకు అతీతంగా కష్టపడి వార్తలు చేరవేస్తారు. కాబట్టి అలాంటి విలేకరులకు కూడా ప్రమాద భీమా ఉండాలానే ఆలోచనతో ఈ పోస్టల్ భీమా చేయించామని చెప్పారు. ఈ సందర్భంగా విలేకరులు తమపై మంచి ఆలోచనతో పోస్టల్ భీమా చేయించినందుకు MLA కామినేని శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 25 :**

కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్ రాజ్ పాండరి అన్నారు. జమ్ము & కశ్మీర్ లోని పహ్లగమ ప్రాంతంలో జరిగిన పాకిస్థాన్ టెర్రరిస్టులు, భారతీయుల హిందూమతం పై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ చెన్ రాజ్ పాండరి ఆధ్వర్యంలో న్యాయవాదులందరు నల్ల బాడ్జ్ ధరించి గజ్వేల్ కోర్ట్ ముందు నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సరైన బదులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఖబర్దార్ పాకిస్తాన్ కుక్కల్లారా ఖబర్దార్ ఖబర్దార్

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**జయభేరి, హయత్ నగర్ :**

జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లో పాకిస్తాన్ పిరికిపంద చర్యగా హిందువులపై దాడిని నిరసిస్తూ, ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆత్మ శాంతి చేకూరాలని వనస్థలిపురం తూర్పు కాలనీల సమైక్యవాసులు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమంలో స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉగ్ర మూకల రూపంలో ఉన్న మత ఉన్మాదులు... ఇస్లామిక్ తీవ్రవాదులు జమ్మూ కాశ్మీర్ లో అస్థిరత సృష్టించి అభివృద్ధిని అడ్డుకోవడం కోసం పర్యాటకులపై ఉగ్రదాడులకు పాల్పడడం విచారకరం. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. ఈ ఘటనకు కారణమైన ఏ ఒక్కరిని నరేంద్ర మోదీ ప్రభుత్వం వదిలిపెట్టదు. ఈ మారణ హోమానికి సమాధానం చెప్పి తీరుతుంది. ఏ ఒక్క తీవ్రవాది కూడా ప్రాణాలతో మిగిలి ఉండరు అన్నివారు తెలిపారు. ఈ కార్యక్రమం బీజేపీ నాయకులు, వివిధ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర రాజకీయాలు చేస్తున్న కార్పొరేటర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

ఇటీవల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగినది. నిరసన కార్యక్రమంలో పాల్గొన బీజేపీ సీనియర్ నాయకులు, బిజెపి కార్పొరేటర్లు, వివిధ డివిజన్ అధ్యక్షుల, కార్యకర్తల మనోభావాలు దెబ్బ తీసే విధంగా తీవ్రవాదుల దిష్టిబొమ్మను మార్ఫింగ్ చేసి భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నట్లు చిత్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులను అప్లోడ్ చేయడం తీవ్రంగా ఖండిస్తూ.. ఇది ఘటనకి పాల్పడిన తోటి కాంగ్రెస్ జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగా రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసుధన్ రెడ్డి, బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంటు జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను లిఖిత పూర్వకంగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది.




## వీరబల్లి అటవీ ప్రాంతంలో 8మంది స్మగ్లర్లు అరెస్టు

- 12 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం

**జయభేరి, అన్నమయ్య:**

వీరబల్లి అటవీ పరిధిలో 8మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్ ను శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) హెడ్ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గనిర్దేశత్వం లో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ విశ్వనాధ్ టీమ్ స్థానిక ఎఫ్బీఓ అనిల్ కుమార్ తో కలసి గురువారం నుంచి అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొంతమంది వ్యక్తులు, ఒక మోటారు సైకిల్ తో కనిపించారు. వారిని పోలీసులు సమీపించే సరికి వాళ్ళు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. చుట్టుపక్కల వెతకగా సమీపంలోని 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టిబడిన వారిని తమిళనాడుకు చెందినవారు గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా వారిని డీఎస్పీలు శ్రీనివాసులు రెడ్డి, షరీఫ్ లు విచారించారు. ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అహోబిలేశుని దర్శించుకున్న విదేశీ భక్తులు..



**జయభేరి, అహోబిలం:**

ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వసంతోత్సవాలలో శుక్రవారం విదేశీ భక్తులు పాల్గొన్నారు. విదేశీ పర్యాటకులు సాంప్రదాయ దుస్తులను ధరించి శ్రీ స్వామివారిని,అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి శ్రీ స్వామి వారి హారతి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎగువ అహోబిలం క్షేత్రంలో కూడా విదేశీ భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.

## మల్లారెడ్డి మహిళా కళాశాలలో ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్ కార్యక్రమం

**జయభేరి, మేడ్చల్ :**



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మ గూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆసియా యొక్క ప్రముఖ ఆర్థిక సేవల సమూహాలలో ఒకటైన డిబిఎస్ టెక్నాలజీస్ చేత ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంటర్‌ప్రైజ్ డేటా లీడర్ విజయ కడియాలా ఆధునిక బ్యాంకింగ్‌లో డేటా యొక్క పరివర్తన పాత్రపై వివరించారు. ప్రపంచ ఆర్థిక రంగంలో ముందుకు సాగడానికి డీబీఎస్ ఆవిష్కరణ మరియు విశ్లేషణలను ఎలా ప్రభావితం చేస్తుంది. డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం ప్రాముఖ్యతను తెలిపారు. అప్రెంటిస్‌షిప్ టాలెంట్ అక్విజిషన్ లీడ్ శాంటోమోమా భరద్వాజ్ విద్యార్థినులకు అప్రెంటిస్‌షిప్ మరియు ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. రియల్ టైమ్ ఎక్స్‌పోజర్ మరియు మెంటర్‌షిప్‌ను అందించే నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా బ్యాంక్ యువ ప్రతిభను ఎలా పెంచుకుంటుందో వివరించారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత మాట్లాడుతూ ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్ లో విద్యార్థుల నుండి ఇంటరాక్టివ్ సెషన్లో చురుకుగా స్పందన వచ్చిందన్నారు. విద్యార్థులకు నియామక ప్రక్రియపై వారి సందేహాలను స్పష్టం చేయడానికి మరియు పోటీ ఉద్యోగ మార్కెట్లో విజయవంతం కావడానికి అవసరమైన నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి ఒక వేదికగా ఉపయోగపడిందన్నారు. ప్లేస్‌మెంట్ సంసిద్ధత కార్యక్రమాలలో భాగంగా జరిగిన ఈ సెషన్, విద్యార్థుల కోసం విద్యాభ్యాసం, పరిశ్రమల అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దీపిక బండి, రోహిత్‌రాజ్, స్పందన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మేడేను జయప్రదం చేయండి

- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 25 :**




అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 139 వ మేడేను విజయవంతం చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మరాఠీ కృష్ణమూర్తి లు పిలుపునిచ్చారు. సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 1886లో చికాగో నగరం లో చెందిన రక్తం నుండి పుట్టిన జెండా ఎర్ర జెండా అని నాటినుండి ప్రపంచవ్యాప్తంగా మే 1న కార్మికుల దీక్ష దినంగా భావించి ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జెండాలు ఆవిష్కరించడం, హక్కుల కోసం ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

భారతదేశంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని, ఉధృతంగా కార్మిక వర్గం మే డే ను విజయవంతం చేయాలని అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి 1923లో నష్టపరిహార చట్టం, 1926 లో కార్మిక చట్టం సాధించుకోవడం జరిగిందని అన్నారు నేడు భారతదేశంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం సంపన్నుల కోసం పనిచేస్తూ కార్మిక చట్టాలు రద్దుచేసి పని గంటలు 12 గంటలకు పెంచి, కార్మిక రక్షణ కవచాలుగా ఉన్న ఈఎస్ఐ పిఎఫ్ సంక్షేమ చట్టాలను రద్దు చేసి యజమానులకు అనుకూలంగా కోడులు రూపొందించారని అన్నారు. కార్మిక వర్గం పై రోజు రోజు నిర్బంధం పెరుగుతుందని ఐక్యమై తిరిగి కొట్టాలని అన్నారు జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘాల జెండాలు ఆవిష్కరించాలని, ప్రదర్శన లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

**జయభేరి, విశాఖపట్నం :**

దివ్యాంగులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. దివ్యాంగుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంకు సామజిక భాద్యత కార్యక్రమం లో భాగంగా అలీంకో సంస్థ తయారుచేసిన 49.01 లక్షల విలువైన 380 అత్యాధునిక ఉపకరణాలను జిల్లా పరిషత్ సమావేశ మందిరం వేదికగా 241 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. విశాఖ జిల్లాలో దివ్యాంగుల శారీరక, మానసిక దృఢత్వం కోసం రూ. 200 కోట్లతో 25 ఎకరాల్లో అత్యాధునిక పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా రీజినల్ సెంటర్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సహకారంతో స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. గత డిసెంబర్‌లో రెడ్డిపల్లి, నీలమ్మ వేపచెట్టు ప్రాంతం, క్వీన్ మేరీ హైస్కూల్ పరిధిలో నిర్వహించిన మూడు ప్రత్యేక శిబిరాల్లో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి తగిన సహాయక ఉపకరణాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

# కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే పహాల్గంలో ఉగ్రవాదుల దాడి

- కాశ్మీర్ పహాల్గంలో పర్యాటకులపై దాడులు చేసిన ఉగ్రవాదులను అంతమొందించాలి
- పల్లా నర్సింహా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

**జయభేరి, దేవరకొండ :**




కేంద్ర ప్రభుత్వం నిఘా సంస్థల వైఫల్యం కారణంగానే కాశ్మీర్ లోని పహాల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసారని,పోలీస్ మారు వేషంలో వచ్చి విచక్షణా రహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి డిమాండ్ చేశారు.
దేవరకొండలో స్థానిక పల్లా పర్వత్ రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయం నుండి పట్టణంలోని ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన భారత పౌరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. చనిపోయిన వారికీ కోటి రూపాయలు, గాయపడిన పౌరులకు 25 లక్షల నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు.కాశ్మీర్లో పర్యాటకులను కిరాతకంగా చంపిన జిహాదీ పాక్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను గుర్తించి అంతమొందించాలని,ఉగ్రదాడికి కారణమైన పాక్ ప్రభుత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా ఒంటరి చేయాలని,వాణిజ్య, వ్యాపార, పర్యాటక రంగాలపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడులు హేయమైన చర్య అని,ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లో అలజడి సృష్టించడమే పాక్ ప్రధాన ఉదేశ్యమని, ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో కేంద్రం ప్రభుత్వం విఫలం చెందిందని ధ్వజమెత్తారు.దేశ వ్యాప్తంగా ఉన్న పౌరులంతా ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం సాకులు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేయకుండా పాకిస్తాన్ కీ తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేసారు.ఈ ఘటనలో గాయలైన వారికీ కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్యం అందించాలని డిమాండ్ చేసారు.దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు ముక్తఖంటంతో ఈ చర్యను వ్యతిరేకిస్తూ మద్దతు పలుకుతున్నాయని అన్నారు.
మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ )పక్షాన ప్రగాఢ సానుభూతిని ,సంతాపం వ్యక్తం చేశారు.మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం దీటుగా పాకిస్తాన్ కు బుద్ది చెప్పాలని అన్నారు.ఈ కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీలో సిపిఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి,జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి,కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, వల్లమల్ల ఆంజనేయులు, మైనోద్దీన్, జూలూరి వెంకట్రాములు, జ్యోతి బస్, తోటపల్లి నగేష్, కిన్నెర యాదయ్య, కందుకూరి శ్రీను, ఏషామోని మల్లేష్, పల్లె మధు, సైదులు, లింగమయ్య, వెంకటయ్య, పగిల్ల బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.




## పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా అంతం

**జయభేరి, పరవాడ:**

పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ మరియు అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్. జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత లేకపోవడం వలన ఇళ్ల వద్ద మురికి నీరు ఎక్కువగా నిలవ ఉండటం వలన దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయిని దోమలు కుట్టడం వలన ముఖ్యంగా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. విపరీతమైన తలపోటు, చలి జ్వరం కండరాలు నొప్పులు, వాంతులు,మొదలగు లక్షణాలు కనిపిస్తాయి .వ్యాధి ముదిరితే తీవ్ర రక్తహీనత వచ్చి కాలేయం కూడా దెబ్బతిని రోగి కోమలోకి వెళ్లే ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. ఇంటి చుట్టుప్రక్కల పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పనికిరాని సామాన్లు, లేకుండా పరిసరాలు అన్ని పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. హారిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్. సాయిరాం. పీ. హెచ్.ఎన్. జానకి రామన్, హెచ్. వి. పి. రత్నం, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ఫార్మాసిస్టు విజయ్ కుమారి, ఎల్. టీ అన్నపూర్ణేశ్వరి, ఎం పి హెచ్ ఎ రాజు ఎ.ఎన్.ఎం.లు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటి సమీక్షా సమేవేశం

- సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెల్యేలు, మండల ప్రజా ప్రతినిధులు,అధికారులు




**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటి సమీక్షా సమేవేశం నిర్వహించారు.సమావేశం లో ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు,హోం మంత్రి వంగలపూడి ఆనిత, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ,పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు,అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉన్నత అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలు మరియు శాసనసభ్యులు ప్రజాప్రతినిధులు,జిల్లా ఉన్నతాధికారులతో మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించిన అంశాల గురించి తెలియజేసారు.

## ఘనంగా జనసేన నాయుకుడు బుగుడి జన్మదిన వేడుకలు



**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం జనసేన పార్టీ నాయకుడు బుగిడి రామ గోవింద్ జన్మదిన వేడుకలు ఈ బోనంగి గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులడు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యుడు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని కేక్ కట్ చెయ్యించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు పరవాడ మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు జనసైనికులు మరియు వీర మహిళలు పెద్ద సంఖ్యలో ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ



**జయభేరి, కైకలూరు, ఏప్రిల్ 25:**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ఆదేశాలతో 94&95వ బూత్ లో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను (20242026) కార్యకర్తలకు పంపిణీ చేసిన కైకలూరు నియోజకవర్గం తెలుగుయువత అధ్యక్షులు దావు నాగరాజు శీలం సురేష్ బాబు పత్తి శివశంకర్ కాసాని బాల యేసు బొమ్మన బోయిన వెంకటరత్నం దాసరి శ్రీను పొట్లూరి నాగరాజు గునిశెట్టి సూర్యనారాయణ యాదల అప్పారావు వట్టిపల్లి నాగబాబు దాసరి లక్ష్మణరావు వట్టిపల్లి సుకుమార్ నీలిపల్లి మహేష్ తోట నాగరాజు దాసరి విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ అభియాన్ పాదయాత్ర

- రాజ్యాంగ విలువలను బిజెపి కాలరాస్తోంది - తోటకూర వజ్రేశ్ యాదవ్

**జయభేరి, ఏప్రిల్ 25:**




భారత రాజ్యాంగంపై బీజేపీకి అవగాహన లేదని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టిందని ఆయన అన్నారు. అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టమాత్మకంగా నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ అభియాన్ పాదయాత్ర శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని మోదీకి పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం అయ్యారని, వారికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందనీ ఆరోపించారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గాంధీ అంబెద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.అంతకుముందు ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారికీ ఐదు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించి సంతాపం తెలియజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి మహాత్మా గాంధీ విగ్రహం మీదుగా రాజీవ్ రహదారి వరకు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చేర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, ఎ బ్లాక్ అధ్యక్షులు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వైస్ గౌడ్, జిల్లా నాయకులు తుంకి మల్లేష్, కంతం కృష్ణారెడ్డి, మహమ్మద్ ముజీబుద్దీన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, గ్రామ మాజీ సర్పంచ్ ఏళ్ళ మల్లేష్, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కోడూరి నర్మద, కాంగ్రెస్ నాయకులు అబ్బగౌని భాస్కర్ గౌడ్, సామల జశ్వంత్ రెడ్డి, గిర్మాపూర్ నర్సింగరావు గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీకర్ రెడ్డి, తుంకి స్వామి , నాటకారి వెంకటయ్య, అబ్బగోని సురేష్ గౌడ్, నాటకారి బాబు, వల్లపు మహేష్, కుదుముల వెంకటేష్, తుంకి లక్ష్మయ్య, తుంకి చిన్నా, తుంకి మహేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చెయ్యండి

- వైకాపా అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ ని కలిసిన పరవాడ మండల వై.సి.పి నాయకులు

**జయభేరి, పరవాడ:**



విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం మింది గ్రామంలో అనకాపల్లి జిల్లా వై సి పి నూతన అధ్యక్షుడుగా నియమితులైన మాజీ మంత్రి, గుడివాడ అమర్నాథ్ ను వారి స్వగృహం నందు పరవాడ మండల వైకాపా నాయుకులు కలిసి దుశ్యాలువతో ఘనంగా సత్కారించారు.
ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా లో అందరూ కలిసికట్టుగా పని చేసి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ని బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వై.ఎస్.ఆర్.సి.పి కార్యకర్తల పై కక్ష పురితంగా వ్యవహరిస్తున్నరని , కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనను గురించి ప్రజల్లోకి తీసుకు వెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్ను జిల్లా పార్టీ అధ్యక్షులు గా నియమించిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి , రాష్ట్ర వై.ఎస్. ఆర్.సి.పి అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి మండల వైకాపా నాయుకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.
గుడివాడ అమర్నాథ్ నియామకం తో జిల్లాలో పార్టీకి పూర్వవైభవం వస్తుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మండల వైకాపా ముఖ్య నాయుకులు పరవాడ ఎంపీటీసీ పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు,వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, రాష్ట్ర మాజీ ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ దాలయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు,బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి ఇద్దరికి తాళీలు కట్టాడు

**జయభేరి, అదిలాబాద్:**

ఈ రోజుల్లో పెళ్లి అంటే చిన్న విషయం కాదు. ముఖ్యంగా అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడం లేదు. అమ్మాయిలు పెట్టే కండీషన్లు, వాళ్లకు అవి కావాలి, ఇలా ఉండాలి ఇలా చాలా కారణాల వల్ల ఇప్పటి కాలంలో పెళ్లిళ్లు జరగటం అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ ఈ గిరిజన యువకుడు మాత్రం ఒకే రోజు, ఒకే మండపంలో ఇద్దరి మెడలో ఆరు ముళ్లు వేసి, ముగ్గురూ కలిసి ఏడడుగులు నడిచారు. ప్రస్తుతం ఈ పెళ్లి వేడుక చర్చనీయాంశంగా మారింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం అడ్డెసర గ్రామానికి చెందిన రంభ బాయ్, బద్రుషావ్ దంపతుల కుమారుడు ఛత్రుషవ్, జైనూర్ మండలం పూనగూడకు చెందిన జంగుబాయి, ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన సోమ్‌దేవిలను ఒకేసారి వివాహమాడాడు. ఇరువురి కుటుంబాల సమ్మతితో అంగరంగ వైభవంగా ఆదివాసీల సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నాడు. తల్లిదండ్రులు, గ్రామస్థులు యువతుల అభిప్రాయాన్ని కోరగా, వారు సరే అన్నారు. దీంతో పెళ్లి సంబురాలు మొదలయ్యాయి. పెళ్లి కార్డులు కొట్టించారు, ఫ్లెక్సీలు వేయించారు. గురువారం ఇద్దరు అమ్మాయిలతో ఒకే వేదికపై ఆదివాసీల సంప్రదాయాల ప్రకారం ఛత్రుషవ్ పెళ్లి జరిగింది. ఈ వివాహ వేడుకను చూసేందుకు బంధువులతో పాటు స్థానికులు, చుట్టుపక్కల గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. అక్షింతలు వేసి వధూవరులను ఆశీర్వదించారు.



## రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..!

- బరువు తగ్గండి ...!
- లావుగా ఉండటం
- తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...!

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం:**

అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి. అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి. ఇంకా అరగంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

## భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ

**జయభేరి, వరంగల్, ఏప్రిల్ 25:**

తెలంగాణలో భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఈ సేవలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. మరోవైపు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారులు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. మండలాల వారీగా వీటిని చేపడుతూ... కొత్త చట్టం ప్రయోజనాలను వివరిస్తున్నారుభూముల నిర్వహణతో పాటు రిజిస్ట్రేషన్ల వంటి అంశాలన్నీ కూడా భూ భారతి పోర్టల్ ఆధారంగానే జరగనున్నాయి. గతంలో ఉన్న ఆర్వోఆర్2020ను రద్దు కావటంతో... భూ భారతి చట్టం ఆధారంగానే భూముల నిర్వహణ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వంటి ప్రక్రియలో ప్రభుత్వం పలు మార్పులను కూడా తీసుకువచ్చింది.రైతులకు ఇబ్బందులు లేకుండా కొత్త చట్టంలో కీలక సెక్షన్లను పొందుపర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పట్టా భూముల యజమానుల హక్కుల సంరక్షణతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా కొత్త చట్టంలో భద్రతాపరమైన సెక్షన్లను ఏర్పాటు చేశారు. పోర్టల్ లో చూస్తే లావాదేవీల నిర్వహణతో పాటు సమాచార సేవలను వేర్వురుగా పొందుపరిచారు. అయితే ఇందులో నిషేధిత భూముల జాబితాను కూడా పొందుపరిచారు.

**నిషేధిత భూముల వివరాలను ఇలా చెక్ చేసుకోండి:**


నిషేధిత భూమి వివరాలు తెలుసుకునేందుకు ముందుగా భూ భారతి అధికారిక పోర్టల్ లోకి వెళ్లాలి. హోం పేజీలో కనిపించే సమాచార సేవల్లోకి వెళ్లాలి. ఇక్కడ నిషేధిత భూములు అనే ఆప్షన్ ఉంటుంది. నిషేధిత భూముల ఆప్షన్ పై క్లిక్ మరో పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ జిల్లా, మండలం, గ్రామ వివరాలను నమోదు చేయాలి. అక్కడ సూచించే కోడ్ ను ఎంట్రీ చేయాలి. సబ్మిట్ చేస్తే గ్రామం వారీగా నిషేధిత భూముల వివరాలు డిస్ ప్లే అవుతాయి. నిషేధిత భూములపై లావాదేవీలు నిర్వహించడానికి వీలు ఉండదు.



## ఏఆర్ రెహమాన్‌కి దెబ్బ మీద దెబ్బ..

మ్యూజిక్ మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ ఇటీవల తెగ వార్తలలో నిలుస్తున్నాడు. భార్యతో విడాకులు, అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిక ఇలా పలు విషయాలతో హాట్ టాపిక్ అవుతున్నాడు. దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ సంగీత దర్శకుడిగా ఉన్న రెహమాన్ గత 30 సంవత్సరాలుగా అనేక అవార్డులు అందుకున్నారు. ఆస్కార్ అవార్డ్ కూడా సాధించిన ఘనత ఆయనది. తాను రూపొందిన ప్రతి పాట ఇప్పటికీ కూడా ఎంతో వినసొంపుగా అనిపిస్తూ ఉంటుంది. అయితే తాజాగా ఏఆర్ రెహమాన్ ఇబ్బందుల్లో పడ్డాడు. కాపీరైట్ ఉల్లంఘన వివాదంలో రెహమాన్ చిక్కుకోవడం సంచలనంగా మారింది. 2022లో మణిరత్నం దర్శకత్వంలో విడుదలైన 'పొన్నియిన్ సెల్వన్' చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించగా, 2023లో పొన్నియిన్ సెల్వన్ రెండవ భాగం విడుదలైంది. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకత్వంలో రూపొందిన వీర రాజ వీర పాట మంచి ఆదరణ పొందింది. ఈ పాట కాపీరైట్‌కు సంబంధించి కోర్టులో దాఖలైన కేసులో ఏఆర్ రెహమాన్ ₹ 2 కోట్లు చెల్లించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. గాయకుడు వాసిఫుద్దీన్ ఠాగూర్ తన తాత, తండ్రి రచించిన శివ స్తుతి సంగీతాన్ని కాపీ కొట్టారని కోర్టులో పిటీషన్ దాఖలు చేయగా, ఇప్పుడు కోర్టు రెండు లక్షలు చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఈ విషయం దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించింది. కాగా, కల్కి రాసిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో విక్రమ్, ఐశ్వర్యారాయ్, రవి మోహన్, కార్తి, త్రిష, ప్రభు, శరత్ కుమార్, విక్రమ్ ప్రభు, ఐశ్వర్య లక్ష్మి, శోభిత తదితరులు నటించారు. ప్రస్తుతం రెహమాన్ తన భార్యతో దూరంగా ఉంటున్నాడు. కాని బంధాన్ని అలాగే కొనసాగిస్తున్నట్టు తెలుస్తుంది. రీసెంట్‌గా కర్మ యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ--- ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం వల్ల తిరిగి అదే తమకు రివర్స్ అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరికీ తల్లి, చెల్లి, భార్య ఉంటారని, ఒకరిపై విమర్శలు చేసేముందు ఇంట్లో వాళ్ళు ఎంత బాధపడతారో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. నేను వేరే వారి కుటుంబం గురించి చెబితే, వేరొకరు నా గురించి, నా కుటుంబం గురించి మాట్లాడుతారు అని రెహమాన్ చెప్పుకొచ్చాడు.

## అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే..



సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో బాలకృష్ణ 'అఖండ 2 తాండవం' ముందు వరుసలో ఉంటుంది. హ్యాట్రిక్ హిట్స్ సింహా, లెజెండ్, అఖండ చిత్రాల తర్వాత బాలయ్య, బోయపాటిశ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'అఖండ 2'పై అంచనాలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి. పైగా బాలకృష్ణ కెరీర్‌లో వస్తున్న తొలి పానిండియా సినిమా 'అఖండ 2' కావడం విశేషం. చిత్ర నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట దాదాపు 200కోట్ల భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పక్కా ప్లానింగ్‌తో శరవేగంగా జరుగుతున్నది. ఇందులో అఖండ రుద్ర సికిందర్ అఘోరాగా బాలయ్య నటవిరాట్ స్వరూపాన్ని చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా కొన్ని కారణాలవల్ల దసరా రేస్ నుంచి తప్పుకుందని, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుందంటూ పలు రూమర్లు సోషల్ మీడియాలో వినిపించాయి. వాటన్నింటికీ చెక్ పెడుతూ శనివారం బోయపాటి పుట్టినరోజు సందర్భంగా ఎక్స్‌లో చిత్ర నిర్మాతలు ఓ పోస్ట్ పెట్టారు. 'థియేటర్లలో మాస్ హిస్టీరియాను సృష్టించే క్రియేటర్.. మా 'అఖండ 2' దర్శకుడు బోయపాటి శ్రీనుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా 'అఖండ 2 – తాండవం' విడుదల కానుంది' అనేది ఈ పోస్ట్ సారాంశం. దీంతో 'అఖండ 2' విడుదలపై వస్తున్న రూమర్లన్నింటికి ఫుల్‌స్టాప్ పడింది. అంటే.. థియేటర్లలో అఖండ తాండవం సెప్టెంబర్‌లోనే అన్నమాట.



## చేసింది మూడు సినిమాలే..

పుష్ప 2 సినిమాతో ఇండియాను షేక్ చేశాడు అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పుష్ప సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు బన్నీ. ఇటీవలే అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా గురించిన అప్డేట్ వచ్చింది. అల్లు అర్జున్ ఈ చిత్రంలో ద్విపాత్రాభినయం చేయనున్నాడని, ఒక పాత్రలో నెగెటివ్ షేడ్స్ ఉంటాయని ఇన్‌సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్, అట్లీ దుబాయ్‌లో స్టోరీ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారని, ఇంకొన్ని రోజులు అక్కడే ఉండి ప్రీప్రొడక్షన్ పనులను పూర్తి చేసే పనిలో ఉన్నారని సమాచారం. షూటింగ్ జూన్ 2025లో ప్రారంభమై, 2026 ఆగస్టులో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని చూపించేలా రూపొందనుందని అంటున్నారు. హాలీవుడ్ సూపర్ హీరోల సినిమాల తరహాలో ఈ సినిమా ఉంటుందని తాజాగా ఇచ్చిన అప్డేట్ చూస్తే అర్ధమవుతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనేదాని పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. మొన్నటివరకు ప్రియాంక చోప్రా పేరు వినిపించింది. ఆతర్వాత సమంత పేరు కూడా వచ్చింది. ఇక ఇప్పుడు మరో ముద్దుగుమ్మ పేరు వినిపిస్తుంది. ఆమె ఎవరో కాదు టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ మృణాల్ ఠాకూర్. ఈ బాలీవుడ్ బ్యూటీ తెలుగులో సీతారామం సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ సినిమాలతో హిట్స్ అందుకుంది. కొంతకాలంగా సినిమాలకు చిన్న గ్యాప్ ఇచ్చింది. చివరిగా కల్కి సినిమాలో చిన్న పాత్రలో మెరిసింది. ఇక ఇప్పుడు అల్లు అర్జున్ సినిమాలో ఛాన్స్ అందుకుందని టాక్ వినిపిస్తుంది, మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.



## అస్త్రాన్ని సంధించిన రాశీ ఖన్నా..

అందరి కెరీర్‌లోనూ అద్భుతాలు జరుగుతున్నాయి.. ఒక్క నా కెరీర్‌లో తప్ప అనుకుంటున్నారు రాశీ ఖన్నా. పాపం ఎన్ని సినిమాలు చేసినా.. ఈ భామకు లక్ మాత్రం కలిసి రావట్లేదు. ఇమేజ్ తెచ్చిన టాలీవుడ్.. నమ్ముకున్న బాలీవుడ్ రెండూ రాశీ కెరీర్‌కు హెల్ప్ అవ్వట్లేదు. చివరి ప్రయత్నంగా గ్లామర్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు.. కొంతమంది హీరోయిన్లకి అందం ఉన్నా అదృష్టం ఉండదు. అందులో అందరికంటే ముందొచ్చే హీరోయిన్ రాశీ ఖన్నా. ఇండస్ట్రీకి వచ్చి పదేళ్ళైనా.. పాతిక సినిమాలకు పైగానే నటించినా.. క్రేజీ హీరోలతో జోడీ కట్టినా.. పాపం ఈ పాప లక్కు మాత్రం మారలేదు. ఈమెతో పాటు వచ్చిన చాలా మంది టాప్ రేంజ్‌కు వెళ్లినా.. రాశీ మాత్రం మీడియం రేంజ్‌లోనే ఆగిపోయారు. ఏదో తమిళ, హిందీ సినిమాలతో లాక్కొస్తున్నారు కానీ తెలుగులో అయితే రాశీ ఖన్నా కెరీర్ ఎప్పుడో చరమాంకానికి చేరుకున్నట్లే కనిపిస్తుంది. అప్పుడెప్పుడో కరోనా కంటే ముందొచ్చిన ప్రతిరోజు పండగేతో చివరి హిట్ కొట్టారు రాశీ. ఆ తర్వాత ఈమె నటించిన వరల్డ్ ఫేమస్ లవర్, పక్కా కమర్షియల్, థ్యాంక్యూ సినిమాలు ఫ్లాపయ్యాయి. దాంతో ఈమెకు ఆఫర్స్ కరువయ్యాయి. తెలుగులో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన తెరకెక్కిస్తున్న తెలుసు కదా.. లో నటిస్తున్నారు రాశీ. ప్రస్తుతం ఈమె నటిస్తున్న సినిమా ఇదొక్కటే. దాంతో ఆప్షన్ లేక సోషల్ మీడియాలో బికినీ షో చేస్తున్నారు ఈ భామ. తాజాగా ఈమె హాట్ ఫోటోషూట్ ట్రెండ్ అవుతుంది. ఆఫర్స్ రావాలంటే.. ఈ మాత్రం గ్లామర్ షో చేయక తప్పదని ఫిక్సైపోయారు రాశీ. మరి ఇదైనా ఆమెకు కలిసొస్తుందా లేదా చూడాలి.



## అతనితో నాది ప్రత్యేక బంధం.. దానికి పేరు పెట్టలేమన్న సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల సినిమాల కన్నా కూడా ఇతర విషయాలతో ఎక్కువగా వార్తలలో నిలుస్తూ వస్తుంది. మయోసైటిస్ వలన సినిమాలు కాస్త తగ్గించిన సమంత సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన పర్సనల్, ప్రొఫెషనల్ కి సంబంధించిన పలు విషయాలు పంచుకుంటూ ఉంటుంది. అలానే ఇంటర్వ్యూలలో ఆసక్తికర విషయాలు తెలియజేస్తూ ఉంటుంది. తాజాగా కోలీవుడ్‌లో జరిగిన గోల్డెన్ క్వీన్ అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ నటి సమంత గోల్డెన్ క్వీన్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తన సినీ ప్రయాణం, వ్యక్తిగత అనుభవాల గురించి మాట్లాడింది. అలానే దర్శకుడు,నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తనకి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, ఆయన తనకు అండగా నిలిచిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తనకు ఆరోగ్యం బాగాలేని క్లిష్ట సమయంలో రాహుల్ రవీంద్రన్ అండగా నిలిచాడని సమంత చెప్పుకొచ్చింది. లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు రాహుల్ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా బంధానికి పేరు పెట్టలేను. స్నేహితుడా, సోదరుడా, కుటుంబ సభ్యుడా అనేది చెప్పలేను అంటూ రాహుల్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తపరిచింది సమంత. ఇక అభిమానుల సపోర్ట్ నాకు ఎప్పుడు ఉంటుందని, అది నా అదృష్టం, హార్ట్ వర్క్, లక్ వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ఇక మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని బట్టి కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. తెలిసీ, తెలియక తీసుకునే ఎన్నో నిర్ణయాలు మన ప్రయాణంపై ప్రభావం చూపుతాయి అని సమంత పేర్కొంది. ఇక దర్శకురాలు సుధ కొంగర.. సమంతపై ప్రశంసలు కురిపించింది సమంత. గత ఐదేళ్లుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నానని,ఆమె కష్టాలు చూసి కన్నీళ్లు వచ్చేవని, ఎంతోమంది అమ్మాయిలకు సమంత స్ఫూర్తి అని అన్నారు ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకెంతో ఇష్టం" అని సుధ కొంగర చెప్పుకొచ్చారు. ఇక అదే సమయంలో నాకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనే ఆసక్తి ఉందని అనడంతో, తప్పకుండా మనం ఒక యాక్షన్ ఫిల్మ్ చేద్దాం అంటూ సుధ కొంగర హామీ ఇచ్చారు

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com